## క్లుప్తంగా

### సమన్వయంతో పనిచేయాలి



ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను సన్మానిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

**నెల్లూరురూరల్ :** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్–2025 అమలుపై సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్లో అమలు చేయాల్సిన కార్యక్రమాలను ప్రకృతి వ్యవసాయ జిల్లా పీడీ మాలకొండయ్య, డీఏఓ సత్యవాణి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ అధికారులు కీలక భూమిక పోషించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు అవగాహన కల్పించి వారి ద్వారా భూమి సారవంతానికి అవసరమయ్యే నవధాన్య విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేసేలా తోడ్పాటు అందించాలన్నారు. ఉద్యానవన పంటల పెంపకానికి సబ్సిడీతో మొక్కలు ఇస్తున్నామని, ఆసక్తి గల రైతులు ముందుకు రావాలని సూచించారు. మండల స్థాయిలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అమలుపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను సన్మానించారు.

### దుస్తుల పంపిణీ



**నెల్లూరు(బృందావనం) :** స్థానిక గాంధీబొమ్మ స్వతంత్ర పార్కు వద్ద కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పేద మహిళలకు అన్నదానం, వస్త్రదానంతో పాటు ఆర్థిక సాయం అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. తన సొంత నిధులతో ఏటా ప్రపంచ మహిళా దినోత్సవాన్ని చేస్తున్నట్లు తెలియజేశారు.

### రోడ్లపై వ్యర్థాలు వేస్తే జరిమానా



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

**నెల్లూరు(బారకాసు) :** నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో రోడ్లపై వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని అదనపు కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. పారిశుద్ధ్య విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మేస్త్రీలు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, కార్మికులందరూ ఆప్రాన్‌లను ధరించాలన్నారు. నిర్దేశించిన సమయానికి ప్రతిఒక్కరూ వారి సచివాలయ పరిధిలో విధులకు హాజరుకావాలని సూచించారు. నగర వ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి శుభ్రం చేసి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించాలని, అదే విధంగా ప్రతి సచివాలయ పరిధిలో జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో ఖాళీ స్థలాల యజమానుల ఖర్చుతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలియజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

### డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) :** రానున్న మెగా డీఎస్సీ పరీక్షకు ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా బీసీ అధికారిణి వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు, బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఇతర వివరాలకు బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### జనసేన నేతల నిరసన

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం రాత్రి గాంధీబొమ్మ సెంటర్ వద్ద జనసేన నేతలు నిరసన తెలిపారు. జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రూరల్ నియోజకవర్గ నేత పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ నాయకుడిని విమర్శిస్తే ఊరుకోమన్నారు. అయితే కార్యక్రమం చివర్లో జై జగన్... జై జై జగన్... అంటూ నినాదాలు చేశారు. పక్కనున్న నాయకులు వారించడంతో నాలుక కరుచుకుని జై జనసేన అన్నారు. గునుకుల కిశోర్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే గుండుకొట్టి సున్నంబొట్లతో గాడిదమీద ఊరేగించడం ఖాయమన్నారు. ఆ పార్టీ నాయకులు నూనె మల్లికార్జున, కారంపూడి కృష్ణారెడ్డి, ఆకు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్కు..

- పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు
- కాలుష్య రహితంతో పాటు ఖర్చులూ మిగులు
- రోడ్లపై రకరకాల వాహనాలు
- తగ్గుతున్న ఇంధన కష్టాలు





షోరూమ్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ బైకులు

**నెల్లూరు(బారకాసు):** ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం భారీగా పెరిగింది. ప్రతి పది మందిలో ఇద్దరు, ముగ్గురు ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలనే కొనుగోలు చేస్తున్నారు. కార్ల వాడకం సైతం క్రమంగా పెరుగుతోంది. ధరను బట్టి వీటి విక్రయాలు ఉంటున్నాయి. వంద కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే బైక్‌లకు ఒక ధర ఉండగా, 30 నుంచి 40 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళ్లే స్కూటీ మరో ధర పలుకుతోంది.

**జోరుగా షోరూమ్‌లు**

నగరంతో పాటు కావలి, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం తదితర ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహన షోరూమ్‌లు జోరుగా వెలిశాయి. జిల్లా వ్యాప్తంగా ఇలా 30కుపైగా ఉన్నాయి. మొత్తం 40 వేలకుపైగా ఎలక్ట్రిక్ వాహనాలు తిరుగుతున్నాయి. నియంత్రణ లేకుండా పెరుగుతున్న పెట్రోల్ ధరను అధిగమించేందుకు వీటిని కొనుగోలు చేసే వారు పెరుగుతున్నారు. వీటి ధరలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ఇస్తుండటంతో పలువురు మొగ్గుచూపుతున్నారు.

**భారీ వ్యత్యాసం**

పెట్రోల్ ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో స్కూటీతో పోల్చుకుంటే ఈవీతో భారీగా ఆదా చేసుకోవచ్చు. పెట్రోల్‌తో నడిచే వాహనం సాధారణంగా 40 కిలోమీటర్ల మైలేజీనే ఇస్తుండగా, లీటర్ ధర ప్రస్తుతం రూ.110 ఉంది. మన వినియోగానికి తగినట్లు డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే ఈవీ స్కూటర్‌కు ఒకసారి చార్జి చేస్తే దాదాపు 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు. ఫుల్ చార్జ్‌కు రెండు నుంచి మూడు యూనిట్లు ఖర్చు అవుతుంది.

**స్పీడు తగ్గితే.. నో రిజిస్ట్రేషన్...**

గంటకు 25 కిలోమీటర్లలోపు స్పీడ్‌తో వెళ్లే స్కూటీలకు ఎలాంటి రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదు. అంతకు పైగా 100/120 కిలోమీటర్ల స్పీడ్‌తో దూసుకెళ్లే స్కూటీలకు, బైక్‌లకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని రకాల నిబంధనలు వర్తిస్తాయి. ఎలక్ట్రిక్ బైక్‌లు వాటి స్పీడ్‌ను బట్టి రూ.1.30 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు మార్కెట్లో ధర పలుకుతోందని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.

**సబ్సిడీ అందిస్తున్న కేంద్రం**

ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటీలు, కార్లను కొనుగోలు చేసే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ నజరానా ఇస్తోంది. స్కూటీలు, బైకులకు ఒక్కో వాహనాన్ని కొనుగోలు చేస్తే కొనుగోలుదారుడికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు సబ్సిడీని కేంద్రం అందిస్తోంది. పెట్రోల్ వినియోగం ఎంత తగ్గితే అంత పొల్యూషన్ తగ్గడంతో పాటు ఖర్చులు తగ్గించి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

**ఎంతో ఆనందంగా తిరుగుతున్నా**



నేను గత 40 ఏళ్లుగా సైకిల్‌నే వాడుతున్నా. ఏడాది క్రితం ఎలక్ట్రిక్ బైక్‌ను కొనుగోలు చేసి వాడుతున్నా. నా లాంటి వాళ్లకు ఇది బాగానే ఉపయోగపడుతుంది. ఒక్కసారి చార్జ్ చేస్తే వేగాన్ని బట్టి రోజు 70 నుంచి 80 కిలోమీటర్ల వరకు తిరగవచ్చు. పెట్రోల్ బైక్ వినియోగం కంటే ఎలక్ట్రిక్ బైక్ వాడుకోవడం వల్ల డబ్బులు ఆదా అవుతుంది. అంతేకాకుండా పొల్యూషన్ కూడా తగ్గుతుంది.

– సుబ్బారెడ్డి, నెల్లూరు నగరం

## పరీక్ష సామగ్రి పంపిణీ



**నెల్లూరు(అర్బన్) :** స్థానిక 25వ డివిజన్ బుజబుజ నెల్లూరులోని డీవీఎస్‌ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని గురువారం అందించారు. దివంగత శాఖవరపు వెంకటరమణయ్య, లక్ష్మీనరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సెట్నెల్ సంస్థ సంయుక్తంగా విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, పెన్సిల్స్, స్కేలు లాంటి కిట్‌ను అందజేశారు. ముఖ్యఅతిథిగా నారాయణ దంత వైద్యకళాశాల ఏజీఎం చొకచర్ల భాస్కర్‌రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ వైష్ణవి, పీహెచ్‌పీ(పీఎంపీ) గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, సెట్నెల్ సిబ్బంది శ్రీనివాసరావు, గయాజ్, వెంకటేశ్వర్లు, పాఠశాల వ్యవస్థాపకుడు దూడల ప్రసాదరావు, హెచ్‌ఎం మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## ఉన్నత స్థాయిలో రాణించాలి



విద్యార్థినులతో ఏఎస్పీ తదితరులు



కమాండ్ కంట్రోల్ రూమ్ గురించి వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు

- ఓపెన్‌హౌస్‌లో ఏఎస్పీ సూచన

**నెల్లూరు(క్రైమ్) :** మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయిలో రాణించి ప్రజలకు సేవలందించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య విద్యార్థినులకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గార్డ్, ఎస్పీ, ఏఎస్పీ చాంబర్‌లు, పోలీసు కార్యాలయంలోని అన్ని విభాగాలు, ఐటీ కోర్, సైబర్ టీమ్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్, పనితీరు, డయల్ 112, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు, డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరుపై పోలీసు అధికారులు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పోలీసులు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే ఓపెన్ హౌస్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్–బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్‌నేరాల కట్టడిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలను ఏఎస్పీ వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ జి.మునిరాజా, మహిళా పోలీస్‌స్టేషన్, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు టీవీ సుబ్బారావు, వెంకటరెడ్డి, అడ్మిన్, వెల్ఫేర్ ఆర్‌ఐలు హరిబాబు, రాజారావు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### రేపు మహిళా దినోత్సవం

**నెల్లూరు (టౌన్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈనెల 8వ తేదీన ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చయ్యలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, పద్మావతి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సుష్మ, సోషల్ వెల్ఫేర్ జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ తదితరులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మహిళలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఏపీజీఈఏ ఆధ్వర్యంలో..**

**నెల్లూరు (పొగతోట) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీజీఈఏ మహిళా విభాగం చైర్‌పర్సన్ సుజాత బాయ్, కన్వీనర్ సువర్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఏనుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేడుకలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖలు, అన్నిస్థాయిలోని మహిళా ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

### విద్యా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నెల్లూరు(బృందావనం) :** జిల్లాలో ప్రతిభ గల బ్రాహ్మణ విద్యార్థులకు తిప్పరాజు వెంకటసుబ్బయ్య సత్రం (టీవీఎస్ కల్యాణ్‌సదన్) ఆధ్వర్యంలో విద్యా ప్రోత్సాహకాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ డి.ఫణిరత్నం గురువారం తెలిపారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ, పీజీ ప్రథమ, ద్వితీయ, ఇంజినీరింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో చదువుతున్న వారికి ప్రోత్సాహకాలను అందజేయనున్నామన్నారు. అర్హత కలిగిన బ్రాహ్మణ విద్యార్థులు 14వ తేదీలోగా ట్రంకురోడ్డు గాంధీబొమ్మ దగ్గర ఉన్న టీవీఎస్ కల్యాణసదన్ కార్యాలయంలో స్వయంగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తులు పంపాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### 'డయల్ యువర్ డీఎం' నేడు

**నెల్లూరు సిటీ :** డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో–1 మేనేజర్ శివకేశవ్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలను 99592 25642 నంబర్‌కు తెలియజేయవచ్చన్నారు.

## రైతులకు అండగా ఉంటాం



నాయకులతో చర్చిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

**నెల్లూరు(సెంట్రల్) :** కోవూరు నియోజకవర్గంలోని అన్నదాతలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పంటకు మద్దతు ధర విషయమై కోవూరు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులతో నెల్లూరులోని తన నివాసంలో ప్రసన్న గురువారం చర్చించారు. రైతులకు అన్యాయం జరగకుండా క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతుగా నిలవాలని సూచించారు.

## సంక్షేమ పథకాల అమలేదీ?

- ప్రచార ఆర్భాటాలతోనే కూటమి సర్కార్
- 8 నుంచి ప్రజా చైతన్య యాత్ర



మాట్లాడుతున్న మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్) :** కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలు నినాదానికే పరిమితమైందని సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. ప్రచార ఆర్భాటాలతోనే ప్రభుత్వాన్ని నడుస్తోందని, పలు సర్వేల పేరుతో సంక్షేమ పథకాల్లో కోత విధించే చర్యలు చేపడుతోందని విమర్శించారు. నగరంలో చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, టిడ్కో గృహాలు, జగనన్న ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు ప్రజల నుంచి పన్నుల పేరుతో బెదిరింపులు, వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. నగరంలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ, విషజ్వరాలు, దోమల బెడద, వీధిలైట్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల పట్టాలు లాంటి సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతోందన్నారు. ప్రజా సమస్యలపై ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు నగరంలో ప్రజా చైతన్య యాత్రలను ప్రారంభిస్తున్నామన్నారు. సమావేశంలో సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు నరసింహ, మూలం ప్రసాద్, రషీద్, కత్తి పద్మ, శ్రీనివాసులు, జాఫర్ పాల్గొన్నారు.

## పార్కులను అందుబాటులోకి తేవాలి



సోంపల్లి మనీష్ ఎన్‌ఎంసీ పార్కును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్

**నెల్లూరు(బారకాసు) :** నగరంలోని అన్ని పార్కుల్లో బల్లలు, ఆట వస్తువులు, జిమ్ పరికరాలు, పచ్చదనం తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. స్థానిక 37వ డివిజన్ న్యూ, ఓల్డ్ మిలటరీ కాలనీలు, రామ్‌నగర్ సీఎస్ఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం కమిషనర్ పర్యటించారు. ముందుగా పసల పెంచలయ్య, సోంపల్లి మహేష్ మున్సిపల్ పార్కులను సందర్శించారు. పాడైన ఆట వస్తువులు, జిమ్ పరికరాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్, హార్టికల్చర్ అధికారులకు సూచించారు. పార్కుల్లో లైటింగ్, క్లోజ్ చేసిన తర్వాత పోలీసులతో పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పాడైన డస్ట్ బిన్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, చిన్న రిపేర్లు అయితే వెంటనే చేయించమని ఆదేశించారు. మురుగు కాలువల్లో సిల్ట్ తీసిన వెంటనే రోడ్లపై ఉంచకుండా మురుగు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. భవన నిర్మాణంలో భాగంగా కాలువల్లో కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ వేసి పారుదలకు అంతరాయం కలిగించే యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ ప్రదీప్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఈఈ శేషగిరిరావు, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్ల పాల్గొన్నారు.

## దళితుల సమస్యలను పరిష్కరించాలి



**నెల్లూరురూరల్ :** జిల్లాలో దళితులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలని కోరుతూ కలెక్టర్ ఆనంద్‌కు మాల మహానాడు నేతలు వినతి పత్రం సమర్పించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన్ను కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించి పరిష్కారం చేయాలని కోరిన వెంటనే కలెక్టర్ స్పందించడం గొప్ప విషయమన్నారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య పాల్గొన్నారు.

## అవినీతి అధికారులపై చర్యలకు వినతి



**నెల్లూరురూరల్ :** గృహ నిర్మాణశాఖలో అవినీతి అధికారుల నిగ్గు తేల్చేందుకు ముందుగా ఎండీ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు.

ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో ఉదయభాస్కర్‌కు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. పెద్ద ఎత్తున అవినీతి చేసిన అధికారులపై ఎండీ కార్యాలయంలో ఎస్ఈలుగా ఉన్న వారు చర్యలు తీసుకోకుండా కాపాడుతున్నట్లు వివరించారు.

## అమ్మణ్ణికి నేత్రపర్వంగా పుష్పయాగం



రాజరాజేశ్వరి అమ్మవారికి పుష్పయాగం గావిస్తున్న వేదపండితులు



తరలివచ్చిన భక్తులు

**నెల్లూరు(బృందావనం) :** నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గురువారం రాత్రి అమ్మవారికి పుష్పయాగం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ దేవస్థానం ప్రారంభించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా అర్చకుడు ఎస్.రఘురామమూర్తి, వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, పత్రులతో అభిషేకించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి విశేష పుష్పాలంకరణలో కొలువైన అమ్మవారిని దర్శించుకుని ప్రణమిల్లి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పద్మావతి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.

## ఘనంగా ఆరాధనోత్సవం



**నెల్లూరు(బృందావనం) :** పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహానంద నాదేంద్ర సరస్వతి స్వామి ఆరాధన మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత అభిషేక, పుష్పార్చనలు జరిగాయి. ఉపన్యాసకుడు గాడేపల్లి ప్రశాంతశర్మ మాట్లాడారు. లలితాపరమేశ్వరి అమ్మవారి తత్వాన్ని, పూజల ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. నిర్వాహకుడు చక్రాల ఆనంద్‌కుమార్, మందిర మేనేజర్ స్వామి సమయానందనాథ, శివగౌరీతేజ, సూరపరాజు రాధాకృష్ణమూర్తి, తంగిరాల శ్రీకాంత్‌శర్మ, ఎం.ఉదయకుమార్‌శర్మ, జి.ప్రభాకర్‌శర్మ, ఎం.నరసింహారావుశర్మ, రాధా, లక్ష్మి, నాగరత్నకుమారి పాల్గొన్నారు.

## ఉద్యోగినుల క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు



లెమెన్ అండ్ స్పూన్ పోటీలో ఉద్యోగినులు

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగినుల క్రీడా పోటీలు గురువారం నగరంలోని ఏసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమయ్యాయి. ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి వెంకటశివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలపర్తి విద్యాసాగర్ జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు మానసిక ఉల్లాసం కోసం ఏటా అసోసియేషన్ తరఫున ఆటల పోటీలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. క్రీడా పోటీల నేపథ్యంలో జిల్లాలోని మహిళా ఉద్యోగులకు రెండు రోజుల పాటు స్పెషల్ పర్మిషన్, ఒకరోజు సెలవు మంజూరు చేసిన కలెక్టర్ ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా విభాగం చైర్‌పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ మాట్లాడుతూ క్రీడా పోటీలు మూడు రోజుల పాటు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డీఈఓ డాక్టర్ ఉమామహేశ్వరి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.శోభారాణి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, సభ్యులు రామకృష్ణ, ఆంజనేయవర్మ, లక్కాకుల పెంచలయ్య, కృష్ణంరాజు, సతీష్‌బాబు, కరుణమ్మ రాజేంద్రప్రసాద్, ఈదూరు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.